

సిటీ పోలీస్.. సూపర్ ఫాస్ట్

కేసుల ఛేదనలో నగర పోలీసులు దూకుడు పెంచారు. ఫిర్యాదు వచ్చిన గంటల్లోనే నిందితుల ఆటకట్టిస్తున్నారు. 8లో



భవితకు 'విద్యా పీఠం'

అనివార్య కారణాలతో చదువులను మధ్యలోనే ఆపేసిన వారికి సార్వత్రిక 'విద్యా పీఠం' వెన్నుదన్నుగా నిలుస్తోంది. 10లో



అర్చకులకే ఆలయాలు

దేవాలయ వ్యవస్థలో సమూల మార్పులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో

న్యూస్‌రీల్

నేడు సీఎం జగన్ కూనవరంలో పర్యటన



సాక్షి, పాడేరు/చింతూరు/కూనవరం: ఇటీవల వరద ముంపునకు గురైన అల్లూరి సీతా రామరాజు జిల్లా కూనవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 10.25 గంటలకు కోతులగుట్ట హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి 10.50 గంటల వరకు ఇటీవల వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు. 10.55 గంటలకు కోతులగుట్టలో బయలుదేరి 11.10 గంటలకు కూనవరం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటారు. 11.10 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుంటారు. తిరిగి 12.45 గంటలకు బయలుదేరి ఒంటి గంటకు కోతులగుట్ట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి 1.05 గంటలకు బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళ్తారు.

నవ్వుతో జీవించడానికి ఒక మైలు నడవండి

- కలెక్టర్ మల్లికార్జున పిలుపు



వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు: వాక్ ఏ మైల్.. లివ్ విత్ ఏ స్మైల్ అంటూ కలెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. జాతీయ వాస్కులర్ డే సందర్భంగా వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సాగరతీరంలో ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి టీయూ–142 యుద్ధ విమానం మ్యూజియం వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్కులర్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జీవనశైలిలో మార్పుతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.దివాకర్, డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


'వాహన మిత్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపట్నం : వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి అర్హులైన వారు ఈ నెల 7వ తేదీలోగా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నవారితో పాటు కొత్తగా ఆటో, ట్యాక్సీ, కొత్త వాహనం కొనుగోలు చేసినవారు, డ్రైవర్లు, ఆధార్, తెల్ల రేషన్‌కార్డు, ఆదాయపన్ను, విద్యుత్ బిల్లు తదితర ధ్రువపత్రాలు దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. దరఖాస్తులను ఆరు అంచెల్లో పరిశీలించి ఈ పథకానికి అర్హత కల్పిస్తారన్నారు. ఈ నెల 31న అర్హులైన వారికి నగదు బదిలీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బి.ఎస్.రెడ్డికి విశాఖ మ్యాజిక్ డైమండ్ బిరుదు



బీఎస్ రెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ మెజీషియన్, ఆస్కార్ ఆఫ్ మ్యాజిక్ అవార్డు గ్రహీత, విశాఖవాసి బి.ఎస్.రెడ్డికి 'విశాఖ మ్యాజిక్ డైమండ్' బిరుదును వాకర్స్ క్లబ్ బహూకరించింది. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీఎస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డి నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశాఖ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.సత్తిరాజు, కార్యదర్శి వేద మధుసూదన్, కోశాధికారి వీసీహెచ్‌వీఆర్ గుప్తా, ఏఎస్ఎన్ ప్రసాద్, ఏహెచ్ఎన్ వెంకట్రావు, బొడ్డు రఘు, డాక్టర్ మద్దుల రాంజీ, దుర్గా సోమేశ్వరరావు, పూసర్ల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరలోని గొప్పతనం తెలుసుకో...



చేనేత చీర నడకలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) ఎకో వైజాగ్ లోగోను ప్రదర్శిస్తున్న కరణం మల్లేశ్వరి, మేయర్ హరివెంకటకుమారి

- చీరతో మగువకు మరింత అందం
- ఒలింపిక్ విజేత కరణం మల్లేశ్వరి, మేయర్ హరి వెంకటకుమారి
- చేనేత చీర నడకకు విశేష స్పందన

బీచ్‌రోడ్డు: మగువకు చీర అందాన్నిస్తుందని.. అందులోనూ చేనేత చీరలు మరింత వన్నె తీసుకొస్తాయని ఒలింపిక్ విజేత, ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ కరణం మల్లేశ్వరి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ద స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ, కంచి కామాక్షి స్కిల్స్ ఆధ్వర్యంలో సాగరతీరంలో ఆదివారం నిర్వహించిన చేనేత నడకకు విశేష స్పందన వచ్చింది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను వీరు జెండా ఊపి



కరణం మల్లేశ్వరిని సత్కరిస్తున్న సీఎంఆర్ డైరెక్టర్ మావూరి మానస

ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయల్లో మహిళల వస్త్రధారణ ఎంతో గొప్పదన్నారు. నేటితరం యువతులకు చీరలోని గొప్పదనం తెలిసేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయన్నారు. దేశంలో సూరత్‌లో మొదటిసారిగా ఇటువంటి వాకథాన్ నిర్వహించారని.. వారిని ఆదర్శంగా తీసుకుని విశాఖలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ వాక్‌థాన్‌కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. వేల సంఖ్యలో మహిళలు చీరలు ధరించి భారతీయ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ సందర్భంగా ట్రెడిషనల్ వాక్, నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. సీఎంఆర్ డైరెక్టర్ మావూరి మానస.. కరణం మల్లేశ్వరి, మేయర్ హరివెంకటకుమారితో పాటు చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు వై.సి.హెచ్ దొరబాబు పాల్గొన్నారు.

కాషాయ వస్త్రాలు ధరించి.. కావడి భుజాన పట్టి..



జాతీయ రహదారిపై మార్వాడీల కావడి యాత్ర

తెల్ల తెల్లవారుతుండగా మాధవధార భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం శివనామ స్మరణతో మార్మోగింది. కాషాయ వర్ణం వస్త్రాలతో చేరిన భక్తులతో ఆ ప్రాంతం శోభాయమానంగా మారింది. మహిళలు, పిల్లలు, వృద్ధులు అన్న తేడా లేకుండా కావడి చేపట్టి తెల్లవారుజామునే మాధవధార కొండకు చేరుకున్నారు. అక్కడ పరమాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత చిన్నచిన్న కుండల్లో నీటిని పట్టి వాటిని కావడి కట్టి మార్వాడీలు యాత్ర ప్రారంభించారు. మాధవధార ఆలయ నుంచి ప్రారంభమై బిర్లా జంక్షన్, కంచరపాలెం, రైల్వే న్యూ కాలనీ, తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా సిరిపురం జగన్నాథ స్వామి ఆలయం వరకు యాత్ర సాగింది. అక్కడ పాండురంగపురంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విశాఖలో స్థిరపడిన మార్వాడీలు సుఖ సంతోషంగా ఉండాలని, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఏటా శ్రావణమాసంలో వచ్చే మొదటి ఆదివారం మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో కావడి యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా కావిడి యాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. మార్వాడీలతో పాటు సింధీ, రాజస్థానీ, స్థానికులు కూడా యాత్రలో భారీగా పాల్గొన్నారు.

'అమృత్ భారత్'తో దువ్వాడ స్టేషన్‌కు మహర్దశ

- రూ.26కోట్లతో అభివృద్ధి, అత్యాధునిక వసతుల కల్పన
- ఎంపీలు ఎంవీవీ, జీవీఎల్ వెల్లడి

అగనంపూడి: అమృత్ భారత్ కార్యక్రమంతో దువ్వాడ రైల్వేస్టేషన్ దశ మారనుందని ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌తో పాటు దేశ వ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా దువ్వాడ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీలు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంతో ముడిపడి ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. వాల్తేరు డివిజన్ పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేయడానికి రూ.400 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఎప్పుడో అభివృద్ధి చేయాల్సిందని.. అమృత్ భారత్‌లో దువ్వాడను ఎంపిక చేసి, అభివృద్ధి చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. స్టేషన్‌ను విస్తరించడంతో పాటు అన్ని రైళ్లు నిలుపుదల



దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీలు ఎంవీవీ, జీవీఎల్, మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

చేయాలని కోరారు. డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దుతామన్నారు. అమృత్ భారత్‌పై నగరంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు ఈ సందర్భంగా అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఎమ్మెల్సీ డి.రామారావు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, విష్ణుకుమార్ రాజు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎగబాకుతున్న ఎయిర్ కార్గో!

- గతంలో రోజుకు ఏడెనిమిది టన్నులకే పరిమితం
- ఇప్పుడది 13–15 టన్నులకు పైగా చేరిక
- వీటిలో అధికంగా ఫార్మా, రొయ్యలు, వస్త్రాలు, దుస్తులు
- త్వరలో ఔట్‌సోర్సింగ్‌కు సరకు రవాణా

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులతో పాటు సరకు రవాణాలోనూ ఎగబాకుతోంది. కోవిడ్ ప్రభావంతో రెండేళ్లకు పైగా కార్గో రవాణా సన్నగిల్లింది. కానీ కొన్నాళ్ల నుంచి దానిని అధిగమిస్తూ మళ్లీ ఇది ఊపందుకుంటోంది. కోవిడ్‌కు ముందు నాటి పరిస్థితులకు చేరుకుంది. ఈ ఎయిర్‌పోర్టు నుంచి కోవిడ్ సమయంలో రోజుకు ఏడెనిమిది టన్నుల సరకు రవాణా జరగడం కష్టతరంగా ఉండేది. ఆ పరిస్థితి నుంచి ఇప్పుడు రోజుకు సగటున 13 నుంచి 15 టన్నుల వరకు రవాణా అవుతోంది. ఏటా జనవరి నుంచి ఆగస్టు దాకా రొయ్యలు, రొయ్య పిల్లల ఎగుమతి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఒక్కోసారి రోజు 20–22 టన్నులకు చేరుకుంటుంది. ఉదాహరణకు గత మార్చిలో 532 టన్నులు (సగటున రోజుకు దాదాపు 18 టన్నులు), మే నెలలో 507 టన్నులు (రోజుకు 17 టన్నులు) చొప్పున సరకు రవాణా అయింది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరకు రవాణా జరుగుతోంది. వీటిలో రొయ్యలు, రొయ్య పిల్లలతో పాటు ఫార్మా ఉత్పత్తులు, అత్యవసర మందులు, దుస్తులు, ఆటోమొబైల్స్, నావికాదళానికి సంబంధించిన వస్తువులు, సరకులు, పరికరాలతో పాటు ఇతర సాధారణ సరకు కూడా రవాణా అవుతోంది. వీటిలో అధిక శాతం రొయ్యలు, ఫార్మా ఉత్పత్తులదే సింహభాగం. జనవరి–ఆగస్టు వరకు కొనసాగే ఆక్వా సీజనులో రోజుకు 150–200 టన్నుల వరకు వీటి



విశాఖ ఎయిర్‌పోర్టులో విమానంలోకి కార్గో రవాణా చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఎగమతులే ఉంటాయి. అలాంటి సమయంలో వీటి రవాణా కోసం ఎయిర్‌పోర్టు అధికారులు ప్రత్యేక అనుమతులు తీసుకుంటున్నారు. ఆ తర్వాత స్థానంలో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్ ఉంటున్నాయి.

ఔట్‌సోర్సింగ్‌కు కార్గో రవాణా..

మరోవైపు ఎయిర్ కార్గో రవాణాను ఔట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకోసం ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ టెండర్లను కూడా పిలిచింది. ఫైనల్ బిడ్‌ను కూడా తెరిచారు. టెండరును ఖరారు చేస్తే ఔట్‌సోర్సింగ్‌లో ఎయిర్ కార్గో ప్రక్రియను టెండరు దక్కించుకున్న సంస్థ చేపడుతుంది. ఈ ఔట్‌సోర్సింగ్ విధానంలో సరకు రవాణాలో వచ్చే మొత్తంలో కొంత సొమ్మును ఎయిర్‌పోర్టు అథారిటీకి చెల్లిస్తారని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. ఈ విధానం అందుబాటులోకి వస్తే ప్రస్తుతం డొమెస్టిక్ కార్గోకే పరిమితమైన సరకు రవాణా.. కొన్నాళ్ల తర్వాత ఇంటర్నేషనల్ కార్గో రవాణాకు వీలవుతుందని తెలిపారు. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా కోవిడ్‌కు ముందునాటి పరిస్థితిని అధిగమించే అవకాశం ఉందని ఎయిర్‌పోర్టు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

విశాఖపై ఎనలేని ప్రేమ

- ఇక్కడ అందాలంటే అంతులేని మోజు
- బీచ్‌లో గడపడానికి ఎంతో ఆసక్తి
- చేపల కూరంటే చెప్పలేనంత ఇష్టం
- ఉక్కు పోరాటంపై ఉత్తేజపరిచే పాటలు
- ప్రజాకవి వంగపండును బావగా సంబోధన
- వైజాగ్‌తో గద్దర్‌కు విడదీయరాని బంధం

సాక్షి, విశాఖపట్నం: విశాఖతో ప్రజా గాయకుడు గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ప్రకృతి రమణీయతకు ఎంతో ముగ్ధులయ్యే వారు. విశాఖ వచ్చినప్పుడల్లా బీచ్‌లోనే ఎక్కువ సమయం గడపడానికి ఆసక్తి చూపేవారు. అలల అందాన్ని తనివి తీరా ఆస్వాదించేవారు. వైజాగ్‌లాగే ఇక్కడ ప్రజలు ఎంతో ప్రశాంతంగా ఉంటారని తరచూ కొనియాడేవారు. విశాఖ ప్రశాంతత చూస్తే కవిత్వం, ఉద్వేగం కలగలిసి ఉప్పొంగుతుందని తన స్నేహితులు, ఆత్మీయులతో చెప్పేవారు.

విశాఖలో దొరికే తాజా చేపలతో వండే కూరంటే ఆయనకు ఎంతో ఇష్టం. అందుకే విశాఖ వచ్చినప్పుడు తాను బావగా పిలుచుకునే ప్రజాకవి వంగపండు ప్రసాదరావు ఇంట్లో తనకిష్టమైన చేపలకూరను వండించుకుని తినేవారు. ఎంతో నిరాడంబర జీవితాన్ని గడిపే గద్దర్.. వైజాగ్ వస్తే హోటళ్లలో గడపడానికి ఇష్టపడేవారు కాదు. ఎవరైనా ఆయనకు హోటళ్లలో గది బుక్ చేస్తామన్నా వద్దని, తన ప్రియమైన బావ (వంగపండు) ఇంట్లోనే ఉంటానని చెప్పేవారు. ఇక విశాఖ వచ్చినప్పుడు వంగపండుతో కలిసి గజ్జె కట్టి పాటలు పాడే వారు. తాను ఎక్కువగా వంగపండు రాసిన పాటలనే పాడతానని గద్దర్ చెప్పేవారు. 2020 ఆగస్టు 4న వంగపండు కన్నుమూయగా.. సరిగ్గా మూడేళ్ల రెండు రోజుల తర్వాత గద్దర్ తన బావ చెంతకే చేరడం యాదృచ్ఛికం!

సమ్మె నీ జన్మ హక్కురన్నో..

ఇక కార్మికుల పక్షాన పాటల రూపంలో ఉద్యమ స్ఫూర్తినిచ్చే గద్దర్ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ యత్నాలపై కూడా చూస్తూ ఊరుకోలేదు. ప్రైవేటీకరణకు నిరసనగా గళమెత్తడమే కాదు.. 'ఉక్కు సత్యాగ్రహం' పేరుతో నిర్మిస్తున్న సినిమాలో నటించడానికి విశాఖ వచ్చారు. సొంతంగా పాట రాసి.. పాడారు.

'అన్నన్న మాయన్న కంపెనీ కూలన్న..
ఎన్నాళ్లు ఈ బతుకు.. ఎదురు తిరగవన్నో..
సమ్మె నీ జన్మ హక్కురన్నో..
దాన్ని ఆపే మొనగాడెవ్వడన్న
ఉక్కు ఫ్యాక్టరీ తల్లి దుఃఖంలో మునిగింది..
విశాఖ సంద్రము శోకమై పొంగింది..
అమరుల త్యాగాలు.. విశాఖ ఉక్కు ఫలాలు..
నెత్తురు చుక్కలు ఎరుపు.. మన స్టీలుపై
మెరిసేటి మెరుపు..
ప్రైవేట్ వాడికి ఫ్యాక్టరీ పాతరేస్తే..
ఉన్న కొలువు ఊడి అన్నమో సున్నము..!'

అంటూ గొంతెత్తారు. ఈ సినిమా మరికొద్దిరోజుల్లో విడుదల కానున్న తరుణంలో గద్దర్ కన్నుమూయడాన్ని విశాఖ వాసులు, ముఖ్యంగా ఉక్కు కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా.. ఉక్కు ఉద్యమం 900 రోజులకు చేరిన సందర్భంగా ఈ జూలై 31న ఆయన విశాఖకు రావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం బాగాలేకపోవడంతో పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడ్డాక వస్తానని చెప్పినట్లు ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు.



ఉక్కు సత్యాగ్రహం సినిమా నటులతో గద్దర్ (ఫైల్)

మూగబోయిన చైతన్య స్వరం

పీడిత ప్రజల యుద్ధనౌక గద్దర్ లేరనడానికి మాటలు రావడం లేదు. గద్దర్ అనే పదానికి పరిచయం అక్కర లేదు. వివరణ అవసరం లేదు. తన గళంతో పల్లె జానపదానికి బ్రహ్మరథం పట్టిన మహా గాయకుడు. పీడిత ప్రజల పక్షాన స్వర పోరాటం చేసిన గానయోధుడు గద్దర్. విప్లవ చైతన్య స్వరం మూగబోయింది.

– ఎం.వెంకటరావు, చైర్మన్, ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ

గద్దర్ లేరంటే నమ్మలేకపోతున్న..

ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని ఎండగట్టిన విప్లవ స్వరం మూగబోయింది. శ్రమైక్య జీవుల కోసం తపనపడే ఆ గళం ఇక వినిపించదనే సత్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. గద్దర్ గళం అజరామరంగా ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది.

– దేవీశ్రీ, ప్రజాగాయకుడు

గద్దర్ గళం.. అజరామరం

కొమ్మాది/ఏయూక్యాంపస్/మద్దిలపాలెం/జగదాంబ/డాబాగార్డెన్స్: దర్శక నిర్మాత పి.సత్యారెడ్డి తెరకెక్కిస్తున్న ఉక్కు సత్యాగ్రహం సినిమాలో నటించేందుకు గద్దర్ విశాఖ వచ్చారు. అదే ఆయన చివరి రాక. ఈ ఏడాది ఫిబ్రవరిలో విప్లవ స్ఫూర్తి నింపే ఓ పాటలో ఆయనపై కైలాసగిరి, మంగమారిపేట బీచ్, ఆర్.కె.బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తనను ఎంతగానో బాధించిందన్నారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం తగదన్నారు. గద్దర్ అకాల మరణం తమను ఎంతో బాధించిందని నటుడు ప్రసన్న కుమార్, ఉక్కు సత్యాగ్రహం దర్శక, నిర్మాత పి.సత్యారెడ్డి, మేనేజర్ బి.రాము అన్నారు.

ఏయూతో అనుబంధం

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఆచార్యులతో గద్దర్‌కు మంచి అనుబంధం ఉండేది. 1990లో ఏయూ ఆరుబయలు రంగస్థలం(ఓపెన్ ఎయిర్ థియేటర్) వేదికగా జరిగిన కాలేజ్ డే లో ఆయన పాల్గొని పలు గేయాలను ఆలపించారు. ఇదే వేదికపై చలసాని ప్రసాద్ కుమార్తె నవత సైతం పలు గీతాలను ఆలపించారు. ఆచార్యులతో



ఆయనకు ఆత్మీయ అనుబంధం ఉండేదని ఏయూ జర్నలిజం విభాగం పూర్వ ఆచార్యులు పి.బాబీవర్ధన్ గుర్తు చేసుకున్నారు. రామా టాకీస్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అమరవీరుల స్మరణ సభలో కూడా గద్దర్ పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి సంతాపం

అల్లిపురం: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి నాయకులు పి.కృష్ణ, జి.కాసులరెడ్డి, బి.శివ, ఎస్.అప్పారావు, బి.చిరంజీవి, కె.రమణ దేవుడమ్మ సంతాపం తెలిపారు. గొప్ప ప్రజా గాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. ఆయన గురించి నేటి తరానికి తెలియజేయాలని కోరారు. ఆయన ఆట, పాట సజీవమన్నారు. ఈ ఏడాది జనవరిలో వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి గద్దర్ హాజరయ్యారు.

గద్దర్ మరణం తీరని లోటు

ప్రజా సమస్యలపై సామాన్యుడి గొంతుకై పోరాటం చేసిన గద్దర్ మరణం తీరని లోటు. ఏయూ మైదానంలో 1999లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన గద్దర్.. దళిత, బలహీనుల వర్గాల్లో తన గళంతో మనోధైర్యాన్ని నింపారు. ఆయన రచించి, గానం చేసిన విప్లవ గీతాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. – చెన్నా తిరుమలరావు, కార్యదర్శి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్

గద్దర్ వల్లే ప్రజా సంస్కృతికి గుర్తింపు

దేశంలో జానపదానికి, ప్రజా సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది గద్దరే. నిజమైన ప్రజా కళాకారుడు ఆయన. ఆయన రచనలు, పాటలకు అంతర్జాతీయ గుర్తింపు రావాలి. గతంలో విశాఖలో గొంతు లచ్చన్నతో గద్దర్ కలిసిన సందర్భం ఇంకా నాకు గుర్తుంది. గద్దర్‌కు శ్రద్ధాంజలి.

– ఆచార్య కె.ఎస్.చలం, యూపీఎస్సీ మాజీ చైర్మన్

సిటీ పోలీస్.. సూపర్ ఫాస్ట్

ప్రియుడి మోజులో పడి భర్తను కిరాతకంగా భార్య కడతేర్చింది. ప్రియుడి స్నేహితుడికి రూ.లక్ష సుపారీ ఇచ్చి మరీ.. కానిస్టేబుల్ అయిన భర్త రమేష్ నిద్రిస్తున్న సమయంలో దిండుతో ఊపిరాడకుండా చేసి చంపించింది. ఉదయం ఏం తెలియని అమాయకురాలిలా భర్త మృతదేహంపై పడి దొంగ కన్నీరు కార్చింది. పోలీసులు కేసు నమోదు చేసిన ఒక్క రోజులోనే భార్య శివాని చేసిన కుట్రను కనిపెట్టేశారు. ఆమెతో పాటు ప్రియుడు రామారావు, అతని స్నేహితుడు నీలాను అరెస్ట్ చేశారు.

చదువు మధ్యలోనే ఆపేసి.. చెడు వ్యసనాలకు బానిసై.. ఎయిర్‌పోర్ట్ నుంచి షీలానగర్ మధ్య కాపు కాసి భారీ వాహనాలను అడ్డుకొని డ్రైవర్లను దోచుకుంటున్నారు. జూలై 16న కూడా ఇదే తరహాలో ఓ లారీ అటుగా వెళ్తుండగా బైక్‌లు అడ్డు పెట్టి.. లారీడ్రైవర్‌ను కొట్టి రూ.2 వేలు దోచుకున్నారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు 48 గంటల్లోనే ముగ్గురు నిందితులు, నలుగురు మైనర్లకు అరెస్ట్ చేశారు.

పెందుర్తిలోని ఓ ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏకంగా అంతర్‌రాష్ట్ర దొంగ చల్లా జాషువా అమిత్‌కుమార్‌ను పట్టుకున్నారు. ఆంధ్రాలోనే కాకుండా తెలంగాణలో కూడా పలు జిల్లాల్లో అతను 52 దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. అతని నుంచి రూ.20.10 లక్షలు విలువ చేసే 402 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇలా ఒకటి.. రెండు కాదు.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నమోదైన 80 శాతం కేసులను 24 నుంచి 48 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. గతంతో పోలిస్తే.. పెండింగ్ కేసుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ఈ ఏడాదిలో నమోదైనా కేసుల్లో సైబర్ నేరాలు మినహా దాదాపు అన్నింటిల్లో నిందితులను గుర్తించడం విశాఖ పోలీసుల పనితనానికి నిదర్శనం. – దొండపర్తి


పోలీస్ ఉన్నతాధికారులతో నేర సమీక్ష చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ(ఫైల్)

నగర పోలీసులు కేసుల ఛేదనలో దూకుడు పెంచారు. ఫిర్యాదు వచ్చిన గంటల్లోనే నిందితుల ఆటకట్టిస్తున్నారు. చోరీల నుంచి హత్యల వరకు ఏ కేసునైనా క్యాలెండర్‌లో తేదీ మారకముందే నిందితులను పట్టుకుని కటకటాల్లోకి పంపిస్తున్నారు. ఒకవైపు నగరంలో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే.. మరోవైపు కేసులను సత్వరమే పరిష్కరించే విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో 80 శాతం వరకు కేవలం ఒక్క రోజులోనే ఛేదించారు. అలాగే ప్రతి కేసులోనూ సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలను కోర్టు ముందు ఉంచుతూ నిందితులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపడుతున్నారు. సీపీ నుంచి డీసీపీలు, ఏడీసీలు, ఏసీపీలు.. ఇలా ఉన్నతాధికారులు సైతం కేసులను స్వయంగా పర్యవేక్షిస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

చిన్న కేసు అయినా ప్రత్యేక దృష్టి

కేసుల దర్యాప్తు విషయంలో నగర పోలీసులు తమ పంథా మార్చారు. చిన్న, పెద్ద అంటూ తేడా లేకుండా ప్రతి కేసుపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీని ఫలితంగానే గాజువాకలో ఓ డ్రగ్ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకొని తీగ లాగితే.. పాన్ ఇండియా డ్రగ్ డీలర్ అలెక్స్‌వాన్ డొంక కదిలింది. విశాఖ పోలీసుల దర్యాప్తు నివేదిక ప్రకారం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు అలెక్స్‌ను అరెస్ట్ చేయగలిగారు. ఈ కేసుతో విశాఖ పోలీసుల సమర్థనీయత పట్ల దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఎయిర్‌పోర్టు ప్రాంతంలో రెండు కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని దర్యాప్తు చేపట్టి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు. ఇలా ఇటీవల కాలంలో

- ఫిర్యాదు అందిన 24 నుంచి 48 గంటల్లోనే కేసుల ఛేదన
- 2 తులాల చోరీ కేసు దర్యాప్తులో 52 చోరీలు చేసిన గజదొంగ పట్టివేత
- సాంకేతికత ఆధారంగా అంతర్‌రాష్ట్ర ముఠాల ఆటకట్టు
- రెండు నెలల్లో నమోదైన 12 కేసుల్లో నిందితులను గంటల్లోనే గుర్తింపు
- సీపీ, డీసీపీలు కూడా కేసుల పర్యవేక్షణతో సత్ఫలితాలు

రూ.2వేల చోరీ కేసుల నుంచి గంజాయి కేసుల వరకు ప్రతీ దానిపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపడుతున్నారు. అవసరమైతే డీసీపీలు, ఏసీపీల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులకు చెక్ పెడుతున్నారు.

ఉన్నతాధికారులకు కేసుల అప్పగింత

స్టేషన్లకు వచ్చే కేసులపై స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎస్‌ఐ, ఇతర సిబ్బంది మాత్రమే కాకుండా ఉన్నతాధికారులు సైతం దర్యాప్తు బాధ్యతలు తీసుకుంటున్నారు. ఏసీపీలు, డీసీపీలతో పాటు నగర పోలీస్ కమిషనర్ కూడా కొన్ని కేసులను స్వయంగా దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కో ఉన్నతాధికారికి కొన్ని కేసులు అప్పగించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వారికి కేటాయించిన కేసులపై స్వయంగా దర్యాప్తు చేయడంతో పాటు మిగిలిన కేసుల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా కేసుల త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. మరోవైపు నిందితులకు కోర్టుల్లో కఠిన శిక్షలు పడే విషయంపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కోర్టుల్లో కేసులు త్వరితగతిన ట్రయల్స్ వచ్చే విధంగా చేపట్టాల్సిన చర్యలపై కోర్టు మానిటరింగ్ సిస్టం(సీఎంఎస్) సిబ్బంది, ఎస్‌హెచ్‌వోలకు సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రతి కేసులోనూ సమగ్ర దర్యాప్తు చేపట్టి పూర్తి నివేదికలను న్యాయస్థానాలకు సమర్పించడంతో నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయి.

పోలీస్ ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టిన కేసుల వివరాలివీ...

అధికారి	కేసులు
పోలీస్ కమిషనర్	5
డీసీపీలు	16
ఏడీసీపీ	5
ఏసీపీలు	45
సీఐలు	150
ఎస్‌ఐలు	415

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు



నగరంలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం నగరంలో నేర శాతం గణనీయంగా తగ్గింది. వ్యక్తిగత కారణాలతో జరుగుతున్న ఘటనలపై కూడా సీరియస్‌గా స్పందిస్తున్నాం. చోరీ కేసులపై కూడా సాంకేతికత సహాయంతో నిందితులను త్వరితగతిన పట్టుకుంటూ చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నాం. కేసు దర్యాప్తు బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగిస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మెట్రో నగరాలకు దీటుగా ఎదుగుతున్న విశాఖలో నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ, నగర పోలీస్ కమిషనర్

• యువత.. కేరింత


ఆర్‌కే బీచ్‌లో స్నేహితుల దినోత్సవ సందడి



ఫ్రెండ్‌షిప్ డే.. పైగా ఆదివారం.. ఇంకేముంది అందాల సాగరతీరం.. స్నేహితుల తీరంగా మారిపోయింది. శుభాకాంక్షల వెల్లువలు.. కేక్ కటింగ్‌లు.. ఆటపాటలు.. సముద్ర స్నానాలు.. సెల్ఫీలు.. వాట్సాప్ షేరింగ్‌లు.. ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్స్.. ఒకటే ముచ్చట్లతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. అలల వయ్యారాలు.. యువత కేరింతలతో సాగరతీరంలో సందడి నెలకొంది. -ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్





ఆర్ట్‌ఫుల్ ఫ్రెండ్‌షిప్

ఏయూక్యాంపస్: స్నేహబంధం విలువైనది, వెలకట్టలేనిది. స్నేహితుల మధ్య అనుబంధం ఎంతో ప్రత్యేకం. స్నేహితుల దినోత్సవాన్ని పెదవాల్తేరులోని బ్లూమేంగో గోర్‌మిట్ వైవిధ్యంగా నిర్వహించింది. మనసుకు నచ్చిన ఆర్ట్ పెయింటింగ్ వేస్తూ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకునే విధంగా సిప్ అండ్ పెయింట్ పార్టీని నిర్వహించింది. 20 మంది మహిళలు పాల్గొని తమలోని కళను కాన్వాస్‌పై చూపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు, సైకాలజిస్ట్ భాగ్యర్క్ సిన్హా మాట్లాడుతూ యువత తమ సమయాన్ని ఉపయుక్తంగా ఉండే ఆర్ట్ థెరఫి కార్యక్రమంలో వెచ్చించారన్నారు. మనసుకు నచ్చిన విధంగా ఆహ్లాదాన్ని కలిగించే విధంగా ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ తమ సమయాన్ని గడిపారన్నారు. అనంతరం మేక్ యువర్ కప్ కేక్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


పెయింటింగ్ చేస్తున్న యువతులు

వైద్య శాఖ పోస్టులకు అనూహ్య స్పందన

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. మొత్తం 18 పోస్టులకు 1,262 దరఖాస్తులు వచ్చాయి. మూడు స్టాఫ్ నర్సు పోస్టులకు 415, రెండు వైద్యుల పోస్టులకు 189, ఎన్‌టీఈపీ పోస్టుకు 151, టి.బి.హెల్త్ విజిటర్ పోస్టుకు 73 దరఖాస్తులు వచ్చినట్లు డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు తెలిపారు. మిగిలిన పోస్టులకు కూడా భారీగానే దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని.. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి తనిఖీ చేస్తున్నారు. కాగా.. ఆగస్టు 15వ తేదీ నాటికి మెరిట్ జాబితా విడుదల చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నారు. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని ప్రజలు తమ సమస్యలను 0891– 2562977 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

శ్మశానవాటికలో స్నేహితుల దినోత్సవం

మునగపాక: మృతి చెందిన స్నేహితులను గుర్తు చేసుకుంటూ మండలంలోని గణపర్తి శ్మశానవాటికలో ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. గణపర్తి బాలాజీ నగర్‌కు చెందిన దుంగల అప్పారావు చనిపోయి ఏడాది అయింది. ఆరు నెలల తరువాత మరో స్నేహితుడు వేపాదుల అప్పారావు మృతిచెందాడు. దీంతో తోటిస్నేహితులు తట్టుకోలేకపోయారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా రోలుగెడ్డను ఆనుకొని ఉన్న అనధికారిక శ్మశానవాటికలో వారివురి పేరున కేక్‌కట్ చేసి గత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. పొనమాళ్ల సూరిప్రకాష్, యల్లపుకొండ, మామిడి శ్రీనివాస్, యల్లబిల్లి దేముడు, కోరిబిల్లి కృష్ణ, గొందిరవి.దుర్గ, రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.


శ్మశానవాటికలో కేక్‌కట్ చేస్తున్న యువకులు

'హింసను ప్రేరేపించేందుకే బాబు పర్యటనలు'

దేవరాపల్లి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలనే దురుద్దేశంతోనే ప్రాజెక్టుల సందర్శన పేరిట చంద్రబాబు పర్యటనలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రగిలిస్తూ, ఎక్కడికక్కడ టీడీపీ గూండాలను రెచ్చగొట్టి పోలీసులపైన, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ఉసి గొల్పుతున్నారని ధ్వజమెత్తారు. రాజకీయంగా పాతాళానికి తొక్కేసిన రాష్ట్ర ప్రజలపై యుద్ధం ప్రకటించారని, అధికారం కోసం బరితెగిస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చాలని తాపత్రయ పడుతున్నారన్నారు. పుంగనూరు ఘటనతో కుట్రలు, కుతంత్రాలు పరాకాష్టకు చేరాయని, వీధి రౌడీలా వ్యవహరిస్తున్న బాబు తీరును చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇతర నియోజకవర్గాల నుంచి రప్పించిన కిరాయి గూండాలు, పచ్చ మూకలు పోలీసులపై దాడులకు తెగబడ్డారన్నారు.

అర్చకులకే ఆలయాలు

- రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించేలా ప్రభుత్వ నిర్ణయం
- ఈ కేటగిరీలో 394 ఆలయాలున్నట్టు ప్రాథమిక అంచనా


టర్నర్ సత్రం ఆవరణలో దేవదాయ శాఖ ప్రాంతీయ కార్యాలయం

జిల్లా పేరు	నాన్ ఎసెస్‌బుల్	6(సి)	6(బి)	మొత్తం ఆలయాలు
శ్రీకాకుళం	39	43	05	87
మన్యం జిల్లా (పార్వతీపురం)	05	25	04	34
విజయనగరం	79	26	03	108
విశాఖ	33	11	--	44
అనకాపల్లి	76	36	06	118
అల్లూరి జిల్లా	--	03	--	03
	232	144	18	394

మహారాణిపేట: దేవాలయ వ్యవస్థలో సమూల మార్పులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అర్చకులకు వంశపారంపర్య ధర్మకర్తల హక్కులు ఇవ్వడం, అర్చకుల జీతాలను పెంచడం, రెండు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించారు. ఇప్పుడు రూ.5 లక్షలలోపు ఆదాయం వచ్చే ఆలయాలను అర్చకులకు అప్పగిస్తూ ఇటీవల మంత్రి వర్గంలో ఆమోదించింది. దీనిపై దేవదాయశాఖ కమిషనర్ మార్గదర్శక సూత్రాలు విడుదల చేశారు.

వివరాల సేకరణలో అధికారులు

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో రూ. 5 లక్షల ఆదాయం వచ్చే ఆలయాలు, ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తల వివరాలను దేవదాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. భక్తులు సమర్పించే కానుకలతోపాటు ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసుకునే షాపులనుంచి వచ్చే అద్దెలు, దేవాలయ భూముల మీద వచ్చే శిస్తులు, టికెట్ల విక్రయం ద్వారా ఆదాయం పరిగణలోకి తీసుకొని ఏడాది ఆదాయాన్ని లెక్కిస్తున్నారు.


ఉత్తరాంధ్రలో మొత్తం 394 ఆలయాలు

ఉత్తరాంధ్ర లోని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మొత్తం 394 ఆలయాలున్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

ఆదాయం బట్టి కేటగిరీ విభజన

దేవదాయ, ధర్మాదాయ శాఖలో ఆదాయ వివరాలను బట్టి కేటగిరిగా విభజిస్తున్నారు. రూ 50 వేలలోపు ఆదాయం వచ్చే ఆలయాలను నాన్ ఎసెస్‌బుల్ కింద పరిగణిస్తారు. ఏడాదికి రూ.25 లక్షల నుంచి కోటి రూపాయలకుపైగా ఆదాయం వచ్చే ఆలయాలను 6ఏ కింద విభజిస్తారు. ఏడాదికి రెండు లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం వచ్చే దేవాలయాలను 6బీ కింద, ఏడాదికి రూ.2 లక్షలలోపు ఉంటే 6సీ కింద విభజిస్తారు.


వివరాలు సేకరిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాలయ ఆదాయ వివరాలు సేకరిస్తున్నాం. తన పరిధిలో మొత్తం ఆరు జిల్లాలు ఉన్నాయి. వీటిలో రూ.5 లక్షలలోపు ఆదాయం కలిగిన ఆలయాల వివరాలు సేకరిస్తున్నాం. త్వరలో దీనిపై దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.

– ఎస్.సుజాత, ఉప కమిషనర్, దేవదాయశాఖ, విశాఖపట్నం

దరఖాస్తు చేసుకోండి



సహాయ కమిషనర్ కార్యాలయంలో ఎవరెవరు ఏ ఆలయాల్లో పనిచేస్తున్నారో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి కమిషనర్‌కు నివేదిక పంపుతాం. అక్కడ నుంచి వచ్చిన తర్వాత ఆలయాల నిర్వహణ వారికి అప్పగిస్తాం. విశాఖ జిల్లాలో 33 ఆలయాలకు వంశపారంపర్య ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తలు ఉన్నారు.

-కె.శిరీష, సహాయ కమిషనర్, విశాఖ జిల్లా

వానలు కురవాలంటూ కప్పలకు పెళ్లి

రాజవొమ్మంగి: వర్షాలు కురవాలంటూ మండలంలోని లోతట్టు గ్రామం అమ్మిరేఖలలో ఆదివారం గిరిజనులు కప్పలకు పెళ్లి చేశారు. అనంతరం వాటిని సమీప కొండ వాగు నీటిలో వదిలిపెట్టారు. తొలకరిలో వర్షాలు కురవడం ఆలస్యం అయితే ఈ విధంగా కప్పలకు పెళ్లి చేయడం ఆచారంగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. రెండు కప్పలను జోలెలో వేసి ఉపవాసం ఉన్న మగ పిల్లలతో ఊరేగించారు. ఇంటింటికి వెళ్లి బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకులు సేకరించారు. అనంతరం సమీప కాలువ వద్దకు వెళ్లి నది ఒడ్డున మట్టితో రెండు కప్పలను చేశారు. అక్కడ వాటికి పసుపు కుంకుమలు అద్ది పూజలు చేశారు. వర్షాలు కురవాలి వానదేవుడా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మట్టితో చేసిన కప్పలను, ఊరేగిస్తూ తీసుకువచ్చిన కప్పలను నీటిలో విడిచిపెట్టారు. అనంతరం వెంట తెచ్చుకొన్న దినుసులతో వంటలు చేశారు. తొలుత ఉపవాసంతో ఉన్న పిల్లలకు ఆహారం వడ్డించి ఆ తరువాత గ్రామస్తులు అందరూ కలసి భోజనాలు చేశారు. ఈ పండుగ చేసిన ఒకటి రెండు రోజుల్లో వర్షం కురుస్తుందని వారి నమ్మకం.


పెళ్లి అనంతరం కప్పలు

జీవీఎంసీలో నూతన ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆవిర్భావం

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో నూతన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఆవిర్భవించింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.వి.వామనరావు సారధ్యంలో నిర్వహించిన ఎన్నికల్లో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వామనరావు, అధ్యక్షుడిగా టి.శ్రీనుబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎస్.కిరణ్‌కుమార్, కె.నాగరాజు, పి.సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి.వాసుదేవరావు, బి.వెంకట్రావు, పి.సతీష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.జగదీష్‌బాబు, బి.కనకరాజు, డి.వి.చంద్రశేఖర్, ఒమ్మి సన్యాసిరావు, సంఘటన కార్యదర్శిగా డింగి మహేష్, సంయుక్త కార్యదర్శులుగా కె.ఈశ్వరరావు, డొక్కర రామారావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరందరిచే వామనరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగ్, జెమ్స్ అసోసియేషన్ నాయకులు అప్పలరాజు, రాజేష్, యూనియన్ నాయకుడు జి.సీతారాం, ఎల్లయ్య, పోలారావు పాల్గొన్నారు.


సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వామనరావు